సాక్షి నంద్యాల

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



కనకదాసు విగ్రహం ధ్వంసం

ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో హైవే-167 పక్కన ఏర్పాటు చేసిన భక్త కనక దాసు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధ వారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. 8లో▸



కేంద్రియ విద్యాలయంలో సీట్ల భర్తీ

డోన్‌లో కొత్తగా ఏర్పాటైన కేంద్రియ విద్యాల యంలో విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున 200 మందికి ప్రవేశం కల్పించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:19,565
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:19,104

న్యూస్‌రీల్

ప్రతి రోగికి అభా ఐడీ తప్పనిసరి



ప్రిన్సిపాల్ సురేఖను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగికి అభా ఐడీ తప్పని సరిగా నమోదు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నంద్యాల మెడికల్ కళాశాలలో గురు వారం ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ కోటిరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు మెడికల్ ఆఫీస ర్లు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషి యన్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వారు మాట్లా డుతూ.. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్, ఆరోగ్య మిత్ర కార్యక్రమాలపై వివరించారు. ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం వచ్చే ప్రతి రోగికి ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు తప్ప నిసరి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీ ఎంఓ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ అనుబంధ విభా గాల్లో పలువురికి చోటు లభించింది. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ గురువారం సాయం త్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడు దల చేసింది. అసెంబ్లీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులుగా నేషా శ్రీనివాసులు, మహిళా విభాగం.. దూదేకుల హుస్సేనమ్మ, రైతు విభాగం.. బెక్కమ్ వెంకట రామసుబ్బా రెడ్డి, ఎస్సీ సెల్.. వై. నాగేశ్వరరావు, ఎస్టీ సెల్.. సురా రామచంద్రుడు, క్రిస్టియన్ మైనార్టీ సెల్.. డాక్టర్ ఎంఎస్‌సీ. మనోజ్, గ్రీవెన్స్ సెల్.. ముక్క మల్ల వివేకానందరెడ్డి, వీవర్స్ విభాగం.. అవ్వారి ఎల్లా సుబ్బరాయుడు, వైఎస్సార్‌టీయూసీ.. షేక్ అల్లాబకాష్, లీగల్ సెల్.. ఎంఎస్ఎమ్‌వీ. ప్రతాప్ రెడ్డి, బూత్ కమిటీ విభాగం.. హరినాథ్ రెడ్డి, పం చాయతీ రాజ్ విభాగం.. ఏసం రామసుబ్బారెడ్డి, ఆర్‌టీఐ విభాగం.. ఎంఆర్ కృష్ణారెడ్డి, వాణిజ్య విభాగం.. ఎస్. మనోహర్ రెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా ఎర్వా దివాకర్ రెడ్డిని పార్టీ నియమించింది.

రేపు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(టౌన్): జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 13న కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తు న్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకో వాలన్నారు. కర్నూలు జిల్లా కోర్టు ఆవరణలో 5 బెంచీలు, ఇతర మండలాల్లో 15 బెంచీలు ఏర్పాటవుతాయన్నారు. కక్షిదారులు లోక్ అదాల త్‌ను వినియోగించుకుని తమ కేసులను రాజీపూ ర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

కేఎంసీలో పెరిగిన మెడిసిన్ పీజీ సీట్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలే జిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి అదనంగా తొమ్మిది పీజీ సీట్లు పెరిగాయి. ప్రస్తుతం 20 పీజీ సీట్లు ఉండగా, అదనంగా 9 సీట్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతిచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. పెరిగిన సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచే అం దుబాటులోకి వస్తాయని, ఈ సీట్ల కోసం ప్రత్యే కంగా జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములును ఢిల్లీకి పంపి ప్రక్రియ పూర్తి చేయిం చామన్నారు. ప్లాస్టిక్ సర్జరీ, క్యాన్సర్ మొదలైన విభాగాల్లో అదనపు పీజీ సీట్ల కోసం ప్రతిపాద నలు పంపించామని, వచ్చే విద్యాసంవత్సరం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

శ్రీగిరిలో 5వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు



భ్రామరీ వనం వద్ద మొక్క నాటుతున్న దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వర్షకాలం ముగిసేలోగా 5 వేల మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు రూపొందించామని శ్రీశైల ఈఓ ఎం .శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరుకు చెందిన ఎన్‌డీఆర్ గ్రూపు చైర్మన్ ఎస్.ఆదికేశవులురెడ్డి శ్రీశైల దేవస్థానానికి 2 వేల బిల్వం మొక్కలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం శ్రీగిరిలోని భ్రామరీ పుష్పవనంలో బిల్వం మొక్క లను దేవస్థాన ఈఓ నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రం మొత్తంలో 30 శాతం దేవతా మొక్కలను నాటడం జరుగుతుం దన్నారు. బిల్వం, కదంబం, రుద్రాక్ష, తెల్లమద్ది, ఉసిరి, రావి, మేడి, వేప మొదలైన వృక్షాలను నాటేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

జ్వరం పీడిస్తూ.. ఆసుపత్రి వణికిస్తూ!



బనగానపల్లె ఆసుపత్రిలో క్యూలో ఉన్న జ్వరబాధితులు

తీవ్రమైన నొప్పులు... శరీరమంతా నిస్సత్తువ.. కళ్ల వెంట వస్తున్న నీళ్లు... వీడని జలుబు, దగ్గు.. ఈ లక్షణాలు ఇటీవల ఎక్కువ అయ్యాయి. జిల్లాలో ప్రతి ముగ్గురిలో ఒకరికి జ్వరం వస్తోంది. వైరల్ ఫీవర్ కావడం తో ఒకరి నుంచి మరొకరికి వస్తూ ప్రతి ఇంట్లో బాధితులు ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇదిలా ఉండగా జిల్లాలో డెంగీ కేసులు సైతం విపరీతంగా పెరిగిపోతున్నాయి.

జిల్లాకు వైరల్ ఫీవర్

- జిల్లాలో ప్రతి ముగ్గురిలో ఒకరికి జ్వరం
- ఏ ఇంట్లో చూసినా బాధితులే!
- కిక్కిరిసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు
- పెద్దాసుపత్రిలో పది రోజులుగా పెరిగిన ఓపీ
- మరోవైపు డెంగ్యూ కేసుల పెరుగుదల

కర్నూలు(హాస్పిటల్)/గోస్పాడు: వర్షాలు తగ్గుముఖం పట్టి మళ్లీ పడుతుండటంతో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చాలా మంది ముం దుగా మెడికల్‌షాపులకు వెళ్లి లక్షణాలు చెప్పి రెండు, మూడు రోజులు మందులు వాడుతున్నారు. అప్పటికీ తగ్గకపోతేనే వైద్యుల వద్దకు వెళుతున్నారు. అయినా కూడా జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యూపీ హెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. గత పది రోజులుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ రోగుల సంఖ్య 3,200లు దాటుతోంది. సాధారణ రోజుల్లో ఈ సంఖ్య 2వేల నుంచి 2,500 మధ్య ఉండేది. అందులోనూ జనరల్ మెడిసిన్, చిన్న పిల్లల విభాగాల్లో రెట్టింపు సంఖ్యలో ఓపీ నమోదవు తోంది. వీటిలో సగం మంది జ్వరపీడితులేనని వైద్యులు చెబుతున్నారు. అందులోనూ ఎక్కువగా వైరల్ ఫీవర్లే ఉంటున్నాయి. ఈ జ్వరం ఇంట్లో ఒకరికి వస్తే క్రమంగా కుటుంబసభ్యులందరినీ వేధిస్తోంది. ముందుగా జలుబు, దగ్గు వచ్చి అనంతరం ఒళ్లునొ ప్పులు ప్రారంభమై తీవ్ర జ్వరం వేధిస్తోంది. మరో వైపు జిల్లాలో ఇప్పటి వరకు 2,198 మందికి డెంగీ లక్షణాలు ఉండగా అందులో 196 మందికి పాజిటి వ్‌గా నమోదైంది. నంద్యాల జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 12 మలేరియా కేసులు, 95 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వర్షాలు కురుస్తున్న నేప థ్యంలో వైరల్ ఫీవర్లు దగ్గు, జలుబు, జ్వరంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన తులసి(10) జూలై 4న విషజ్వరంతో మృతి చెందింది. జిల్లాలో 29 మండలాల పరిధిలో 52 పీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే 16 అర్బన్ హెల్త్‌సెంటర్లు, 11 సీహెచ్‌సీలు, రెండు ఏరియా, జిల్లా ఆసుపత్రితో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. అయితే ఐదుగురు డాక్టర్లు, ఎంపీహెచ్ఏ(ఎఫ్) 50, ల్యాబ్ టెక్నిషియన్లు 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్లు కూడా లేరు. దీంతో వైద్యం దైవాధీనం గా మారింది.



బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీలో ఓపీ వద్ద బారులుదీరిన జనం

ప్రైవేటుకు భయపడి..

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖర్చు చేయడానికి భయ పడి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే అక్కడ అరకొర వైద్యం అందుతోంది. పీహెచ్‌సీల్లో చాలా చోట్ల వైద్యులు ఉండకపోవడంతో అక్కడున్న నర్సులు, ఫార్మాసిస్టులే మందులు ఇస్తున్నారు. దీంతో సీహె చ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, కర్నూలు పెద్దా సుపత్రికి రోగులు వస్తున్నారు. సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో జ్వరలక్షణాలను బట్టి మందులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో బతుకుజీవుడా అంటూ జ్వరపీడితులు నంద్యాల, కర్నూలు ఆసుపత్రులకు వెళ్తున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు, నాలుగు గంటలు నిలబడితే గానీ పూర్తిస్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. కర్నూలు ఆసుపత్రి జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ వంటి విభాగాలు రోగుల రద్దీ దృష్ట్యా మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగిస్తున్నాయి.

ప్రైవేటులో ఫీజులే బాదుడు!

జ్వరం వచ్చిన వారు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే డెం గీ, మలేరియా ఉంటుందేమోనని పదిరకాలకు పైగా రక్తపరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రిని బట్టి పరీక్షలు, చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఉంటోంది. అది మలేరియా, డెంగీ లాంటి లక్షణాలుంటే మాత్రం ఆసుపత్రిలో నాలుగైదు రోజులు చేరి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.30వేల నుంచి రూ.50వేల దాకా వసూలు చేస్తున్నారు. ఆర్థికస్థో మత ఉన్న వారు వైద్యులు చెప్పిన మేరకు ఖర్చు చేస్తుండగా మరికొందరు ఇప్పుడే వస్తామంటూ అక్కడి నుంచి జారుకుని ప్రభుత్వ ఆసు పత్రులకు వెళ్తున్నారు.

కస్తూర్బా విద్యార్థులకు విష జ్వరాలు



విద్యార్థిని ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులు విష జ్వరాల బారిన పడటంతో ఇంటి బాట పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి జ్వ రాలు రావడంతో పాఠశాల సిబ్బంది మందులు ఇస్తుం డేవారు. జ్వరాలు తగ్గు ముఖం పట్టకపోవడంతో దాదాపు 20 మంది విద్యార్థినులను ఇళ్లకు పం పారు. సమాచారం అందు కున్న తల్లితండ్రులు పాఠ శాలకు చేరుకుని తమ పిల్ల లను ఇళ్లకు తీసుకెళ్లారు. జ్వరంతో పాటు జలుబు, చేతు లకు దద్దులు వస్తున్నట్లు విద్యా ర్థుల తల్లితండ్రులు తెలిపారు. ప్రస్తుతం విష జ్వరాలు ప్రమాద కరంగా మారడంతో ప్రైవేట్ వైద్య శాలకు తీసుకెళ్లి వైద్యం చేయించు కున్నారు. పాఠశాలలో 200 మం దికి పైగా విద్యార్థినులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితం గా నిర్వహిస్తున్నాం. వర్షా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దోమల వల్ల విషజ్వ రాలు ప్రబలే అవకాశం ఉంది. సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. ముందు జాగ్రత్త గా దోమలు కుట్టకుండా చూసుకోవాలి. ప్రాథమిక కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యం అందిస్తున్నాం. ఏదైనా సమస్య వస్తే, జ్వరాలు తగ్గని వారికి జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నాం. వ్యాధి నివారణ అనేది మనం తీసుకొనే జాగ్రత్తలపై ఆధారపడి ఉంటుంది. పరిసరాల్లో మురికినీరు లేకుండా చూసుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్‌రావు, జిల్లా మలేరియా అధికారి, నంద్యాల

వైరల్ ఫీవర్లే ఎక్కువగా వస్తున్నాయి



ఆసుపత్రిలోని జనరల్ మెడి సిన్ ఓపీకి ప్రతిరోజూ 300 నుంచి 400 మంది రోగులు వస్తున్నారు. అందులో సగా నికి పైగా జ్వరపీడితులే ఉం టున్నారు. ఎక్కువశాతం జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు, జ్వరంతో బాధప డుతున్న వారే ఉన్నారు. సీజనల్‌గా వచ్చే వైరల్ ఫీవర్లే ఉంటున్నాయి. జ్వరతీవ్రత 102 నుంచి 104 ఫారిన్‌హీట్ వరకు ఉంటోంది. అవసరమైన వారికి వైద్యనిర్ధారణ పరీక్షలు చేయించి మందులు ఇచ్చి పంపిస్తున్నాం. ఇందులో రోజూ 10 నుంచి 15 మంది అడ్మిషన్ చేస్తున్నాం. కొందరికి మలేరియా లక్షణాలు కనిపిస్తుండటంతో అందుకు సంబంధిం చిన వైద్యం అందిస్తున్నాం.

–డాక్టర్ కె.సోమప్ప, అసోసియేట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

నంద్యాల పెద్దాసుపత్రిలో గత తొమ్మిది రోజులుగా నమోదైన ఓపీ

తేదీ(వారం)	ఓపీ సంఖ్య	జనరల్ మెడిసిన్	పీడియాట్రిక్స్
1(సోమ)	1,320	240	92
2(మంగళ)	1,270	190	85
3(బుధ)	1,180	227	102
4(గురు)	1,375	210	210
5(శుక్ర)	1,236	210	186
6(శని)	1,150	185	306
7(ఆది)	300	10	0
8(సోమ)	1,170	230	308
9(మంగళ)	1,140	196	292

ఉప్పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు



కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

నంద్యాల(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం ప్రభావంతో జిల్లా తడిచిముద్దయ్యింది. బుధ వారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 128.4 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో వంకలు, వాగులు పొంగి పొర్లాయి. వాహనాల రాకపోకలు స్తంభించాయి. పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భారీ చెట్లు, విద్యుత్ స్తం భాలు నేల కూలాయి. అవుకు మండలంలో 67.2, ప్యాపిలి 66.2, ఆళ్లగడ్డలో 60.4, నంద్యాల అర్బన్ 59.8, బండిఆత్మకూరు 56.2, నంద్యాల రూరల్ 55.2, చాగలమర్రి 52.2, కోవెలకుంట్ల 50.0, గోస్పా డు 43.6, ఉయ్యాలవాడ 32.4, బనగానపల్లె, సంజా మల 30.0, పాణ్యం 25.2, శ్రీశైలం 20.2, డొర్నిపాడు 19.2, రుద్రవరం 17.6, బేతంచెర్ల 17.2, మహానంది 15.2, గడివేముల 13.2, శిరివెళ్ల 9.8, వెలుగోడు 9.4, పాములపాడు 5.2 మి.మీ మేర వర్షపాతం నమోదైం ది. వర్షం వరి రైతులకు మేలు చేకూర్చేదిగా ఉండగా మొక్కజొన్న, మినుము రైతులకు నష్టాన్ని మిగిల్చింది.

➤ ఉయ్యాలవాడ మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మిరప, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. కోవెలకుంట్ల, జమ్మలమడుగు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో అల్లూరు, గుళ్లదుర్తి గ్రామాల మధ్య భారీ వృక్షాలు నేలకూలాయి. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి.

➤ కోవెలకుంట్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

➤ అవుకు సమీపంలోని కొండమీది గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

➤ కొత్తపల్లి మండలంలో భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి.

➤ ఆత్మకూరు పట్టణంలో భవనాశి, సుద్దవాగు ఉప్పొంగి ప్రవహించాయి.


➤ ఆళ్లగడ్డలో భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలు, మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులకు టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం తడిసి వాన నీటిలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. సంజామల మండలం పేరుసోముల, రామిరెడ్డిపల్లె గ్రామాల్లో కంది, ఉల్లి, మినుము పం టలు నీట మునిగి రైతులు భారీగా నష్టపోయారు.



నిలిచిపోయిన బస్సులు, వాహనాలు

➤ కొలిమిగుండ్ల మీదుగా వెళ్లే నెల్లూరు–ముంబై హైవేపై భారీ వర్షం కారణంగా తెల్లవారుజాము నుం చి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. దీంతో అటు తిమ్మనాయిని పేట, ఇటు కొలిమిగుండ్ల వరకు వాహనాలు 6 కి.మీ మేర నిలిచిపోయాయి. జమ్మలమడుగు, తాడిపత్రికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె



కలచట్లలో కూలిన మట్టి మిద్దె

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. మండలంలో 66.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పలు పాత మిద్దెలు కారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో అంబా చంద్రశేఖర్‌కు చెందిన మట్టి మిద్దె కూలింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ప్రజలను మభ్యపెట్టడంలో చంద్రబాబు దిట్ట

- జగనన్న హయాంలో రైతులు ఏనాడూ రోడ్డెక్కలేదు
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజలను మభ్యపెట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్ట అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. గురువారం కాటసాని స్వగృహం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండానే అధికారంలోకి వచ్చాక 15 నెలల్లోనే హామీలన్నీ మొత్తం అమలు చేశామని అనంతపురం జిల్లాలో సభలో చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్ప దమన్నారు. అధికారంలోకి వచ్చాక మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని సభలో ఊదరగొట్టారన్నారు. అయితే ఆడ బిడ్డ నిధి, నిరుద్యోగభృతి పథకాల ఊసే లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అంద రికీ అందలేదన్నారు. ఉచిత బస్సు పథకం కేవలం కొన్ని బస్సులకే పరిమితం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పేదలందరికీ నాణ్యమైన చదువులు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి పనులు మొదలు పెట్టామన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ఆనాడు మేధా వులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. అయితే ఆ మెడికల్ కళాశాలలపై చంద్ర బాబు కుట్ర పన్నుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో పనులన్నీ ఆపి ఏకంగా పది మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.

రైతుల పరిస్థితిపై చర్చకు సిద్ధమా..

గత వైఎస్సార్‌సీపీ పాలన, ప్రస్తుత 15 నెలల కూటమి ప్రభుత్వ పానలలో రైతుల పరిస్థితులపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని కాటసాని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులు ఏనాడు రోడ్లపైకి రాలేదన్నారు. కేవలం 15 నెలల పాలన కాలంలో రైతుల పరిస్థితి ఎలాగుందో రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తు న్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ఆర్డీవోలకు వినతి పత్రమిచ్చామ న్నారు. రైతుల కోసం పోరాటం చేయడం తప్పా? అన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీలో పాల్గొనకుండా నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల అభ్యున్నతి కోసం ధరల స్థిరీకరణ తీసుకు వచ్చి వారికి అండగా నిలిచామన్నారు. సమావే శంలో కార్పొరేటర్లు చిట్టెమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు అక్కిమి హనుమం తురెడ్డి, కేవీ రమణారెడ్డి, సుంకన్న, శివారెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బాబ్బాబు.. రండి!

- మండల మీట్‌కు హాజరు కాని ఎంపీటీసీ సభ్యులు
- ఇళ్లకు వెళ్లి కారులో తీసుకొచ్చిన అధికారులు
- అర గంటలో మమ అనిపించిన వైనం



కారులో నుంచి దిగుతున్న సర్వాపురం ఎంపీటీసీ సభ్యుడు కిరణ్



మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

రుద్రవరం: మండల సర్వ సభ్య సమావేశం అంటే మినీ శాసనసభ లాంటిది. ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకె ళ్లి పరిష్కరించేందుకు మంచి అవకాశం. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల తీరును ఎండగట్టేందుకు సరైన వేదిక. అలాంటి మండల మీట్ మొక్కుబడి సమావేశంగా మారిపోతుంది. ఏదో వచ్చామా.. సంతకాలు చేశామా.. వెళ్లామా అన్నట్లుగా సభ్యు లు, అధికారులు వ్యవహరిస్తున్నారు. గురువారం రుద్రవరం మండల మీట్‌కు సభ్యులు ఎవరూ రాక పోవడంతో అధికారులే వారి ఇళ్ల వద్దకు వెళ్లి వాహ నాల్లో పిలుచుకొచ్చి మమ అనిపించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ మబ్బు బాలస్వామి అధ్యక్షతన ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్రమణ్యం గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 ప్రారం భం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం రూ.12.30 గంటలకు మొదలైంది. అయితే తమకు 20 నెలలు గా వేతనాలు అందడం లేదని, తాము చెప్పిన సమస్యలు పరిష్కారం కావడం లేదని, పెట్రోల్ ఖర్చులు దండగా అని ఎంపీటీసీ సభ్యులు ఎవరూ రాలేదు. సమావేశం నిర్వహించేందుకు సరిపడ సభ్యుల కోరం లేక పోవడంతో అధికారుల్లో దడ మొదలైంది. అప్పటి నుంచి ఎంపీటీసీలందరికీ ఫోన్లు చేస్తూ సమయం లేదు త్వరగా రండి అంటూ బతిమిలాడారు. 14 మంది ఎంపీటీసీల్లో కనీసం ఐదుగురినైనా రప్పించాలని ప్రయత్నాలు చేశారు. ఎవరూ స్పందించక పోవడంతో మండల పరిషత్ అధికారులు ఏకంగా కారు తీసుకోని ఇతర గ్రామాల్లోని ఎంపీటీసీ సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని బతిమిలాడి తీసుకురావడంతో 12.30 గంట లకు సమావేశాన్ని ప్రారంభించారు. 20 శాఖలకు సంబంధించిన అధికారులు కేవలం అరగంట లోపే తమ నివేదికలు చదివి వినిపించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దారు మహమ్మద్ రఫీ, ఎంఈఓ లక్ష్మీదేవి, ఏఈలు కమాల్, సుబ్రమణ్యం, పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



ఇటీవల జర్నలిస్టులు, 'సాక్షి' ఎడిటర్‌ను తరచూ ప్రభుత్వం కేసులతో వేధిస్తోంది. చివరకు ఓ జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి ప్రెస్‌మీట్ నిర్వహిస్తే దాన్ని ప్రచురించినందుకు కూడా ఎడిటర్‌పై కేసు నమోదు చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఫోర్త్ పిల్లర్‌గా భావిస్తాం. మీడియాను నిరోధించడం, అడ్డుకోవడం, జర్నలిస్టులను బెదిరించడం అమానుషం. ప్రజల గొంతును వినిపించే బాధ్యత ప్రజాప్రతినిధులు, మీడియాది. మీడియాను అడ్డుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. రాజకీయ అజెండాతో పుట్టిన కొన్ని పత్రికలే న్యూట్రల్‌గా వార్తలు రాస్తుంటే, న్యూట్రల్ పత్రికలుగా ఉన్నవి పూర్తి రాజకీయ అజెండాతో పని చేస్తూ ప్రభుత్వాలను, వ్యవస్థలను శాసిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజాస్వామిక వాదులు, ఇతర మీడియా సంస్థలు ఈ వైఖరిని ఖండించకపోవడం కూడా తప్పే. ప్రజాస్వామ్యానికి దురదృష్టకరం. – **బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, మాజీ మంత్రి**



పత్రికా స్వేచ్ఛపై దాడి అనైతికం



ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోసం పనిచేసే ఏ రాజకీయ పార్టీలు కూడా పత్రిక స్వేచ్ఛకు ఆటంకం కలిగించకూడదు. పత్రికా స్వేచ్ఛ అంటే భారత రాజ్యాంగంలో 19(1) ఏ ద్వారా కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా పనిచేస్తాయి. నేతల ప్రసంగాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వాటి నైతిక బాధ్యత. అలాంటి పత్రికలపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎడిటర్, పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య. పత్రికల్లో ఏవైనా వార్తలు అభ్యంతరకరంగా ప్రచురితమైతే నేతలు వివరణ ఇవ్వాల్సి ఉంది. చట్టం తమ చేతుల్లో ఉంది కదా అని చెప్పి పత్రికలపై తప్పుడు కేసులు నమోదు చేయడం సబబు కాదు. కూటమి ప్రభుత్వపు నిరంకుశ ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు. – **శిల్పా మోహన్ రెడ్డి, మాజీ మంత్రి**

క్లుప్తంగా

డిప్లమా కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ డిప్లమా కోర్సుల దరఖాస్తు గడువు పొడిగించినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 27వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు భర్తీ చేసిన దరఖాస్తులను కార్యాలయ పనిదినాల్లో కర్నూలు మెడికల్ కాలేజి కార్యాలయంలో రూ.100 రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తులు aprahpc.co.in వెబ్‌సైట్‌లో లభిస్తాయన్నారు. అక్టోబర్ 10వ తేదిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఈ కోర్సులకు ఇంటర్, తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, తర్వాత మిగిలిన గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ప్రైవేట్ నర్సింగ్‌హోంలో వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మంత్రాలయం మండలం సుగూరు గ్రామానికి చెందిన పార్వతి పెద్దపెండేకల్‌కు చెందిన నరసింహులకు ఇచ్చి కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. రెండో కాన్పుకు పార్వతి పుట్టినిల్లు సూగురుకు వచ్చింది. బుధవారం సాయంత్రం నొప్పులు రావటంతో ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తీసుకొచ్చారు. రాత్రి నర్సింగ్ హోంలో అడ్మిట్ చేసుకొని గురువారం ఉదయం డెలివరి చేస్తామని థియేటర్‌లోకి తీసుకెళ్లారు. మత్తు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికి ఫిట్స్ రావటంతో పరిస్థితి బాగోలేదని ఆదోనికి పంపించారు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందింది. సాయంత్రం నర్సింగ్ హోం దగ్గరకు మృతదేహం రావటంతో పెద్ద సంఖ్యలో బంధువులు చేరుకుని ఆందోళన చేపట్టారు. అయితే పెద్ద ఎత్తున పరిహారం ఇచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించినట్లు తెలిసింది.

అమరవీరుల సేవలు స్మరణీయం



అటవీ అమరవీరుల దినోత్సవంలో అటవీ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అటవీ శాఖ కర్నూలు డివిజన్ స్క్వాడ్ డీఎఫ్‌వో రవిశంకర్ అన్నారు. గురువారం అటవీ శాఖ సర్కిల్ కార్యాలయంలో జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవం జరిగింది. డీఎఫ్‌వోతో పాటు కర్నూలు రేంజ్ ఎఫ్ఆర్‌వో విజయకుమార్, స్క్వాడ్, సోషల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, సర్కిల్ కార్యాలయం ఏవోలు అబ్దుల్ సుభాన్, షానవాజ్, డివిజన్ కార్యాలయం ఏవో మహమ్మద్ ఏషన్, అటవీ శాఖ ఉద్యోగులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్క్వాడ్ డీఎఫ్‌వో రవిశంకర్ మాట్లాడుతూ కర్నులు సర్కిల్ పరిధిలో 23 మంది అటవీ శాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. వారి సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు అడవుల సంరక్షణ బాధ్యతను మరువకూడదన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వర్ష బీభత్సం.. జల దిగ్బంధం



ఉయ్యాలవాడ, పడిగెపాడు గ్రామాల మధ్య నీటమునిగిన పత్తి పంట



అమడాల సమీపంలో మిరప పంటను ముంచెత్తిన వర్షపునీరు



సి.బెళగల్ మండలం పోలకల్లో వరద నీటిలో కొట్టుకు వచ్చిన ఉల్లి



హొలహర్వి-నిట్రవట్టి వెళ్లే దారిలో ఉప్పొంగిన వాగు



సి.బెళగల్ మండలం పోలకల్ సమీపంలో వాగులో ప్రయాణికులతో చిక్కుకపోయిన ఆర్టీసీ బస్సు



అల్లూరు గ్రామ సమీపంలో నేల కూలిన భారీ వృక్షం



కోవెలకుంట్లలో జలమయమైన రహదారి



గుండ్రేవుల గ్రామం దగ్గర వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాకపోకలకు స్తంభించాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. కొన్ని చోట్ల ఆర్టీసీ బస్సులు వాగుల్లో చిక్కుకుపోయాయి. ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారు. పొలాల్లో పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. –సాక్షి నెట్‌వర్క్



కుసుకుంట-ఉప్పలపాడు మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కర్నూలు సమీపంలోని జాతీయ రహదారిలో నిలిచిన వర్షపు నీరు



కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామంలో నేలమట్టమైన విద్యుత్ స్తంభం

కర్నూలు సర్కిల్ అటవీ శాఖ కన్జర్వేటర్‌గా కృష్ణమూర్తి

● ఎస్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ పిటీగా విజయకుమార్





కృష్ణమూర్తి, బి.విజయ్ కుమార్

కర్నూలు కల్చరల్/ఆత్మకూరురూరల్: కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్)గా ఐఎఫ్ఎస్ బీవీఏ కృష్ణమూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఎఫ్ఎస్ బదిలీల్లో భాగంగా శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా ఉన్న ఈయనను కర్నూలుకు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న బి. విజయకుమార్‌ను శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న వి.సాయిబాబను తిరుపతి డీఎఫ్‌వోగా, అనంతపురం డీఎఫ్‌వో విగ్నేష్ అప్పావూను ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల ఘర్షణ

మంత్రాలయం రూరల్: భూ వివాదంతో ఏకంగా తహసీల్దార్ కార్యాలయంలోనే ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటన మంత్రాలయంలో గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని వగురూరు గ్రామంలో ఒక వ్యక్తి.. తనకు 28ఎకరాలు ఉండాల్సి ఉండగా ఒకటిన్నర ఎకర పొలం తక్కువగా ఉందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కారించడానికి ఇరువర్గాల వారు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న ప్రజలు, రెవెన్యూ సిబ్బంది పరుగులు తీశారు. అధికారులు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని మందలించి బయటకు పంపేశారు. దీంతో వారు పోలీస్‌స్టేషన్ చేరుకుని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ఏర్పాట్లు



ప్రొజెక్టర్ మానిటర్ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ గురించి వివరిస్తున్న డాక్టర్ నాగరాజు, చిత్రంలో డాక్టర్ మహేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు క్యాన్సర్ వ్యాధిన పడకుండా ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సామాజిక అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఆరోగ్య కార్యకర్తలు హాజరయ్యారు. నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌ల స్క్రీనింగ్ గురించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డాక్టర్ నాగరాజు వివరించారు. అనంతరం డాక్టర్ మహేశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే ఈ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతి మంగళ, గురువారాల్లో ఓపీ నెం.222కు రెఫర్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వెంకట సుబ్బ నాగరాజు, సాహితి, జయరామ్, విజయభాస్కర్, హడస్కా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆర్‌కేఎస్కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన సామాజిక అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు

కేంద్రీయ విద్యాలయంలో సీట్ల భర్తీ



లాటరీ పద్ధతిలో సీట్లను భర్తీ చేస్తున్న అధికారులు

డోన్ టౌన్: డోన్‌లో కొత్తగా ఏర్పాటైన కేంద్రీయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి లాటరీ పద్ధతిలో విద్యార్థులకు సీట్లు కేటాయించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటైంది. 765 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా గురువారం ఎంపిక ప్రక్రియ కమిటీ కన్వీనర్ ప్రిన్స్‌పాల్ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ప్రకారం 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు సీట్లు కేటాయించారు. లాటరీ పద్ధతిలో ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున 200 మందికి ప్రవేశం కల్పించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను కమిటీ స్కూల్ చైర్మన్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం నోటీసు బోర్డులో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో కమిటీ సభ్యులు టీచర్ల కేటగిరి నుంచి ఒకరు, ఎస్సీ, ఎస్టీ కేటగిరి నుంచి ఇద్దరు, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాధికారులు ప్రభాకర్, నాయక్ హాజరు కాగా అధికారుల సమక్షంలో వీడియో కెమెరా చిత్రీకరిస్తూ లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. కాగా ఎంపిక ప్రక్రియ ప్రారంభంలో కొంత గందరగోళం నెలకొంది. ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు కన్వీనర్‌ను ప్రశ్నించగా.. తుది జాబితా ప్రకటనలో ఏవైనా అనుమానాలు ఉంటే అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చునని సూచించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



ధ్వంసం చేసిన మద్యం సీసాల వద్ద పోలీసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం ఒకటవ పోలీసు స్టేషన్ పరిధిలో గత రెండేళ్లుగా వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. గురువారం శ్రీశైలంలోని డంపింగ్ యార్డ్ సమీపంలో నంద్యాల ఎక్సైజ్ ఏఈఎస్ రాముడు, ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి, సీఐ ప్రసాదరావు, రెవెన్యూ అధికారుల సమక్షంలో మద్యం బాటిళ్లకు పంచనామా నిర్వహించి ధ్వంసం చేశారు. 15 నాటుసారా కేసుల్లో 186 లీటర్ల నాటుసారా, 17 కేసుల్లో పట్టుబడిన ఏపీ మద్యం 598 సీసాలు, 11 కేసుల్లో పట్టుబడ్డ తెలంగాణ మద్యం 599 సీసాలను ట్రాక్టర్‌తో తొక్కించారు.

మద్యం విక్రేత అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్

పగిడ్యాల: 'బడి పక్కనే మద్యం దుకాణం' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. పడమర ప్రాతకోట ప్రాథమిక పాఠశాల (మెయిన్) పక్కన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పులికంటి మద్దిలేటిని అరెస్ట్ చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. నందికొట్కూరు పట్టణంలోని వివిధ షాపుల్లో మద్యం తెచ్చుకుని అధిక ధరలకు గ్రామంలో విక్రయిస్తుండగా ఏఎస్ఐ శేషయ్య సిబ్బందితో నిఘా వేసి పట్టుకున్నామన్నారు. అతని వద్ద 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.



పట్టుకున్న మద్యం సీసాల వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

● ఎలుకలు తెచ్చిన తంటా!



గోపికృష్ణ(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఎలుకలు తెంపిన విద్యుత్ వైర్లను చూడకుండా తొక్కి విద్యుదాఘాతంతో గోపికృష్ణ(13) అనే బాలుడు మృతి చెందాడు. ఈ విషాదం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎద్దుల మార్కెట్ సమీపంలోని కిరాణం దుకాణంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. వెంకటేష్, పద్మావతిలకు రామకృష్ణ, గోపికృష్ణ ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి రెండో కుమారుడు గోపికృష్ణ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. గురువారం కిరాణం దుకాణానికి వచ్చిన వారికి సరుకులు ఇస్తూ చూసుకోకుండా కిందపడి ఉన్న విద్యుత్ వైర్‌పై కాలు పెట్టాడు. షాక్ గురై కుప్పకూలిపోయాడు. తల్లిదండ్రులు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. విద్యుత్ వైర్లను ఎలుకలు తెంపడంతో విషాదం చోటుచేసుకుంది. కుమారుడు మృతి చెందటంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కనకదాసు విగ్రహం ధ్వంసం



మనేకుర్తిలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం



ఆలూరు ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న కురువలు

ఆలూరు రూరల్: మండలంలోని మనేకుర్తి గ్రామంలోని హైవే–167 పక్కన ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. కనకదాసు వి గ్రహం ఎడమ చేయి విరగొట్టారు. విగ్రహ ధ్వంసా న్ని నియోజకవర్గ కురువ సామాజిక వర్గం నాయకులు ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషాకు ఫిర్యాదు చేశారు. విగ్రహ ధ్వంసాన్ని నిరసిస్తూ మాదారి,మాదాసి కురువ సంఘం నాయకులు స్థానిక అంబేద్కర్ కూడలిలో గంట పాటు ధర్నా చేపట్టారు.కార్యక్రమంలో దేవేంద్రప్ప,అయ్యాళప్ప, మల్లికార్జున, మహానంది, లింగ,రాజు,నాగేంద్ర,మంగన్న, చంద్ర,ఉల్లేప్ప కురువ కులస్తులు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన ఎమ్మెల్యే విరూపాక్షి

కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఖండించారు. కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

అవినీతి దాహం తీరేలా!



ముదిగేడులో నిర్మించిన పశువుల నీటి తొట్టి

సంజామల: పశువుల దాహం తీర్చేందుకు ఊరూరా ఏర్పాటు చేసిన నీటి తొట్లు అధికారులు, టీడీపీ నాయకుల అవినీతిని ఎత్తి చూపుతున్నాయి. నాసిరకంగా నిర్మించి బిల్లులు స్వాహా చేయడంతో ప్రారంభానికి ముందే పగుళ్లు ఇస్తున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలానికి 19 నీటి తొట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతానికి 15 పూర్తయ్యాయి. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ. 30 వేలు వెచ్చించారు. కాగా కొన్ని చోట్ల టీడీపీ నాయకులు, మరి కొన్ని చోట్ల అధికారులు నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. నాణ్యత లోపించి ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.



ప్రారంభించక ముందే పగులిచ్చిన దృశ్యం